తాతపూడిలో 72 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

తాతపూడి గ్రామంలో అంగర పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ జివి.గీతాంజలి, డాక్టర్ పి .రత్నకుమారి లు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య పరీక్షల్లో 72 మందికి పలు రకాల వైద్య సేవలు అందజేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఫ్యామిలీ డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలను, షుగర్ పేషంట్లను, వద్ధులకు శస్త్ర చికిత్సలు జరిపి, లేవ లేని స్థితిలో ఉన్న వారి ఇంటికి వెళ్లి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గర్భిణులు, వద్ధులు, బాలింతలకు కార్యక్రమ ప్రాముఖ్యతను హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు జె వెంకటలక్ష్మి, కార్యదర్శి మోహన్, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

కోటిపల్లి రేవులో అవినీతి చేపలు

- అనుమతులు లేకుండా పంటుల నిర్వహణ
- అధికారికంగా వేలం నిర్వహించలేదు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి రేవులో అధికారుల అనుమతుల్లేకుండా నవంబర్ 1వ తేదీ నుంచి పంటులు ప్రయాణికులను దాటిస్తూ రేవులో ప్రయాణాలు కొనసాగుతున్నాయి. కె.గంగవరం మండల పరిధిలోగల కోటిపల్లి గోదావరి రేవుకు ఈ ఏడాది మార్చిలో జరగాల్సిన బహిరంగ వేలం ఎవరు పాటకు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో జూలై నుంచి అక్టోబర్ వరకు వరదల కారణంగా రేవును మూసివేశారు. వరదలు తగ్గిన రేవు నిర్వహణ కొనసాగికపోవడంతో జిల్లా పరిషత్ నిర్వహణలో గల కోటిపల్లి రేవును మండల పరిషత్ కు కోటిపల్లి రేవును నిర్వహించేందుకు అనుమతులు ఇస్తూ అందుకోసం త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 27న త్రీ మాన్ కమిటీ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైంది. దీని ప్రకారం డిఆర్‌డిఒ రామకష్ణారెడ్డి, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, కె.గంగవరం జెడ్‌పిటిసి సభ్యురాలు ఓబులనేని వరలక్ష్మిలతో కలిపి త్రీ మాన్ కమిటీని ఏర్పాటు చేశారు. వీరిచే మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎన్.శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు మండల పరిషత్ అభివద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రభుత్వం టెండర్లు వేసి బహిరంగ వేలం నిర్వహించి ఐదు నెలల కాలానికి వేలం ఖరారు చేస్తామన్నారు. ఈ మేరకు కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించి అక్టోబర్ రెండో వారంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు అయితే నవంబర్ ఒకటో తేదీ వచ్చిన కమిటీ ఏ విధమైన నిర్ణయం తీసుకోలేదు.

ఏ విధమైన అనుమతులు లేకుండా రేవులో పడవలు, పంటు లు నిర్వహించడంపై అధికారులను వివరణ కోరగా వారు ఈ విషయమై తమకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు. రేవులో అనుమతులు లేకుండా రేవు నిర్వహణపై పలువురు విమర్శిస్తున్నారు.

కోటిపల్లి రేవులో అనధికారికంగా ప్రయాణికులను చేరవేస్తున్న పంటు

అధికారికంగా బహిరంగ వేలం నిర్వహించలేదు: ఎంపిడిఒ

కోటిపల్లి రేవులో బుధవారం నుంచి ప్రయాణాలు కొనసాగుతున్నాయని రేవు నిర్వహణ బహిరంగ వేలం జరగకుండా ఎవరికి అప్పగించారని కె.గంగవరం ఎంపిడిఒ ఎన్.శ్రీనివాస్ ని ప్రశ్నించగా రేవునిర్వహణ తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే అధికారికంగా బహిరంగ వేలం నిర్వహించి ఎవరికి అప్పగించలేదని ఆయన వివరించారు. ఈ విషయాన్ని త్రీ మెన్ కమిటీకి తెలియజేశానని అన్నారు. జిల్లా పరిషత్ అధికారులకు, సిఇఒకు ఈ విషయమై తెలియజేసి వారి నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఎంపిడిఒ వివరించారు.

రేవు నిర్వహణపై సమాచారం లేదు

కోటిపల్లి రేవు నిర్వహిస్తున్న సంగతి తనకు తెలియదు. త్రీ మెన్ కమిటీ వేసినప్పటికీ తమకు రేవు నిర్వహిస్తున్నట్లు ఎవరూ చెప్పలేదు. ఈ విషయం తన దష్టికి రాలేదని, కేవలం త్రీమెన్ కమిటీ సభ్యులుగా ఉన్నామని దీనిపై అధికారులే చర్యలు తీసుకోవాలన్నారు.

-పంపన నాగమణి, ఎంపిపి, కె.గంగవరం

తూతూ మంత్రంగా త్రీమెన్ కమిటీ

త్రీ మెన్ కమిటీ తూతూ మంత్రంగా వేశారని, తమకేమీ అధికారాలు లేవు. దీనిపై అధికారులు కోటిపల్లి రేవు నిర్వహిస్తున్నట్లు మాకు ఎవరికీ చెప్పలేదు. బహిరంగ వేలం జరక్కుండా రేవును ఎలాగా అప్పగించారని దీనిపై అధికారులు సమాధానం చెప్పాలి.

–ఓబులనేని వరలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు , కె.గంగవరం

సిపిఎం బస్సుయాత్ర జయప్రదానికి పిలుపు

సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం

సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా లౌకికవాదం- ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని రాష్ట్ర అభివద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర నవంబర్ 7న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా పర్యటించనుందనిని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు తెలిపారు.

ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సు యాత్రకు ఉదయం 9 గంటలకి మండపేటలో స్వాగతం పలుకుతూ జిల్లాలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. అనం తరం రావులపాలెంలో 11 గంటలకి బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 1గంటకు అమలాపురం ప్రెస్ క్లబ్ నందు నిర్వహించే విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకత్వం పాల్గొంటారని అన్నారు. మధ్యాహ్నం 2గంటలకి అమలాపురం హైస్కూల్ సెంటర్ నందు బహిరంగ సభ జరుగుతుందని, ఈ బహిరంగ సభలో బస్సు యాత్ర రాష్ట్ర నాయకత్వం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె .లోకనాథం, మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు కె.ధనలక్ష్మి, అంద్రా మాల్యాద్రిలు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం అమలాపురం నుంచి రాజోలు మీదుగా చించినాడ వరకూ బైక్ ర్యాలీతో పశ్చిమగోదావరి జిల్లాకి ఈ బస్సు యాత్రను సాయంత్రం 4.30గంటలకు వెళుతుందన్నారు. ఈ బస్సు యాత్ర, బహిరంగ సభల్లో పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కారెం వెంకటేశ్వరరావు కోరారు.

ధాన్యం సేకరణపై జెసి సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ తదితర అంశాల సన్నద్ధత పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సమీక్షించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి 22 మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి 22 మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ అంశాల సన్నద్ధత పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల నాలుగో తేదీ తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇప్పటికే ధాన్యం సేకరణ సంబంధించి మిల్లర్లతో చర్చించామన్నారు. గోనె సంచులు ఆర్‌బికెలకు సరఫరా చేస్తారని, వాటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బికెల్లో వీలైనంత ఎక్కువ సంఖ్యలో గోనెసంచులు నిల్వ చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు వినియోగించే వాహనాలన్నిటిలో జిపిఎస్ సిస్టం అందు బాటులో ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 524 వాహనాలు ధాన్యం రవాణా కొరకు రిజిస్ట్రేషన్, జిపిఎస్ సిస్టం ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకి సంబంధించి కొన్ని చోట్ల సిబ్బంది కొరత ఉన్న దష్ట్యా సిబ్బందిని నియమించే చర్యలు చేపట్టామని త్వరలో నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు. మిల్లులను మండలాలు వారిగా మ్యాపింగ్ చేయడం జరిగిందని ఆ యొక్క మండలాలు టార్గెట్ పూర్తయిన తర్వాత పక్క మండలా లకు ధాన్యాన్ని పంపిస్తారన్నారు. తేమ శాతాలలో వ్యత్యాసాలు ఉత్పన్నం కాకుండా టెక్నికల్ అసిస్టెంట్లు స్వయంగా రైతు క్షేత్రాలలో కల్లాల వద్దకు వెళ్లి నాలు గైదు చోట్ల ధాన్యం రాశుల్లో శాంపు ల్స్ ను సేకరించి శాస్త్ర యుక్తంగా పరీక్షలు నిర్వహించి కచ్చితంగా తేమ శాతాన్ని నిర్ధారించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధాకర్, డిఎస్ఒ ఎ.పాపారావు, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసు బాబు, జిల్లా సహకార అధికారి రాధాకష్ణారావు, వ్యవసాయ మార్కెటిం గ్ శాఖ సహాయ సంచాలకులు కే విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట మండలంలోని వెలగతోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ఆవరణలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నేరుగా రైతులు నుంచి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి వారి ఖాతాలకే నగదును జమ చేస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంగన్‌వాడీల మొట్టమొదటి మహాసభలు నవంబర్ 3,4, తేదీల్లో జరుగుతాయని సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం పేర్కొన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మహాసభల పోస్టర్ లను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల రాష్ట్ర సభ్యురాలు కె.కృష్ణవేణి మాట్లాడారు. మహాసభల్లో అంగనవాడీ సమస్యల మీద చర్చిస్తామని అన్నారు. కొత్త కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

11కెవి కె.గంగవరం ఎంఎచ్ఎం ఎజిఎల్ ఫీడర్ మీద చెట్ల కొమ్మలు తొలగించట వలన శుక్రవారం కె.గంగవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఇఇ వై.విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గంటల 9 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు కె.గంగవరం గ్రామములో ఇళ్లకు, వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయమై వినియోగదారులు సహకరించవలసినదిగా ఒక ప్రకటనలో తెలియజేశారు.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రోళ్లపాలెం గ్రామానికి చెందిన రాయుడు కష్ణ హరి ప్రమాదవశాత్తు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయారు. గురువారం ఈ విషయం జనసేన నాయకులు మోటూరి వెంకటేశ్వరరావు ద్వారా తెలుసుకున్న సూరపరెడ్డి సురేష్, అమలాపురానికి చెందిన గుండాబత్తుల గోపాలరావు, రుక్మిణి దంపతుల సహకారంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు చిందాడగరువు ఎంపిటిసి సభ్యురాలు మోటూరి కనకదుర్గ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గనిశెట్టి శ్రీను, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలకూ మేలు

ప్రజాశక్తి-ఆలమూరు

జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు చేకూరుతోందని కొత్తపేట ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్‌లో గడప గడపకూ.. మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

అధికారులు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్ లను ప్రజలకు అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ పేదల బతు కులు మార్చాలన్న లక్ష్యంతో సిఎం వైఎస్.జగన్ తెచ్చిన అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ యనమదల నాగేశ్వ రరావు, సర్పంచ్ దంగేటి చంద్రకళ, వైసిపి నేతలు తోరాటి రాంబాబు, దంగేటి బాపణయ్య, జాంపోలు మాణిక్యం, వాసన రాజు, తోరాటి దుర్గారావు, కార్యదర్శి శ్యాం సుందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

కొత్తపేట మండలం లోని అవిడి గ్రామంలో గడప గడపకూ.. మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా 192 వ రోజు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు.

నేడు కేశవరంలో గడప గడపకూ ..

మండపేట మండలంలోని కేశవరం గ్రామంలో గడప గడపకూ.. మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కామాక్షి అమ్మవారి గుడి దగ్గర నుంచి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపిపి ఉండమట్ల వాసు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

తాపేశ్వరం రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం

ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండలంలోని మండపేట తాపేశ్వరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే రోడ్డులో తరచూ ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుండడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. కొద్ది రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తరచూ ఎదురెదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వాహనదారులు అంటున్నారు. భారీ వాహనాలతో రాకపోకలతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయలోనే ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోందన్నారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు.

బారులు తీరిన వాహనాలు

ఎర్ర గ్రావెల్ తీసుకువెళ్లే లారీలు టిప్పర్లు కనీసం కంకరపై బరకం, టార్పల్ తప్పకపోవడంతో పడుతున్న గ్రావెల్, రోడ్డు నిర్మాణ పనులు నేపథ్యంలో లేస్తున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కిడ్నీ బాధితునికి పింఛను అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గోపవరం పంచాయతీ జయపురానికి చెందిన నాగాబత్తుల ప్రసాద్ కిడ్నీ వ్యాధితో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో ఐసియూ లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వాలంటీర్ పండు నిఖిత సహ వాలంటీర్ దొమ్మేటి ఈశ్వరరావుతో ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ నిమిత్తం రూ.10 వేలు పింఛను ప్రసాద్ కు అందజేశారు.ఈ సందర్భంగా వాలంటీర్లను సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు గ్రామస్తులు అభినందించారు.

ఆస్పత్రిలో బాధితునికి పింఛను అందజేస్తున్న వాలంటీర్ నిఖిత

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మెర్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత. పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి నెట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సిహెచ్.శ్రీహరి, వ్యాయామ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఆత్రేయపురం మహాత్మా గాంధీ ఎయిడెడ్ హైస్కూల్ మైదానంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో అండర్-17 విభాగంలో 8 విద్యార్థులు జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. త్వరలో నెల్లూరు, కష్ణా జిల్లాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనున్నారని హెచ్ఎం అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జెడ్‌పిటిసి సభ్యుడు బోనం సాయిబాబా, ఎంపిపి కుండా అన్నపూర్ణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంఇఒ వరప్రసాదరావు, గ్రామసర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసి సభ్యులు మెర్ల వీరబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ పువ్వల లక్ష్మీ నారాయణ , విద్యార్థులు అభినందించారు.

అండర్-17 ఫుట్ బాల్ పోటీలకు ..

ఉప్పలగుప్తం అండర్-17 అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలకు భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ ఉన్నత పాఠశాల్లో 8,9 తరగతులు చదువుతున్న గొలకోటి దుర్గామహి, కృష్ణతేజలు ఎంపికయ్యారు. వీరిని గురువారం ఆ పాఠశాలలో హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే శిక్షణ ఇచ్చిన పిడి లు కామన మధుసూదనరావు, కరాటం దుర్గాప్రసాద్‌లను పాఠశాల వ్యవస్థాపకులు శిరంగు సత్తిరాజు, పిఎంసి ఛైర్మన్ సబ్బతి జ్యోతి, ఉపాధ్యాయులు ఆరవ నాయుడు, పెండ్యాల శ్రీనివాసరావు, వేటూరి వెంకటేశ్వరరావు,పద్మనాభన్ తదితరులు అభినందించారు.

'అన్ని రంగాల్లో రాష్ట్రం వెనుకబాటు'

ప్రజాశక్తి-మండపేట

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు విమర్శించారు. రాయవరం మండలంలోని పసలపూడి గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమంలో గురువారం ఎంఎల్ఎ పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటకీ వెళ్లి వైసిపి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన అంతానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబుతో నేను కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల

రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పించి రహదారుల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళదేవి తెలిపారు. విలసవిల్లి వీవర్స్ కాలనీలో ఎంపీ చింతా అనురాధ సమకూర్చిన నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను గురువారం సర్పంచ్ ప్రారంభించారు .గ్రామంలో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా అభివద్ధి చేస్తున్నట్టు ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, ముత్యాల వెంకటనారాయణ, గెడ్డం సాయి, పుత్యల ఏసు, గంపల బున్ని, పిచ్చుక అశోక్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. . ఉదయం 9 గంటల నుండి వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి వివిధ రకాల పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్ రాజు దంపతులు మరియు ఇఒ సత్యనారాయణ రాజు దంపతులు, ధర్మకర్త మండల సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పరవాసుదేవ అలంకరణలో శేష వాహనంపై కోనేటి రాయుడు మాఢవీధులలో విహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను అలరించాయి. వచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

శేషవాహనంపై విహరిస్తున్న వెంకన్న, చిత్రంలో పాల్గొన్న భక్తులు

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆలమూరు

తహాశీల్దార్ శెట్టి

మండలంలోని జొన్నాడ, గుమ్మిలేరు, ఆలమూరుల్లో జగనన్న నవరత్నాల్లో భాగంగా 2 వేలు ఇళ్లస్థలాల సంబంధించి లబ్ధి దారులందరికీ పట్టాలు పంపిణీకి లేఅవుట్లల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ ఐపి.శెట్టి అన్నారు. ఈ మేరకు గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 3 నుంచి పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులందరికీ ఇప్పటికే సమాచారం ఇచ్చామనిఅన్నారు. అలాగే వారంతా కొత్తపేట ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా నిర్ణీత సమయానికి విచ్చేసి పట్టాలు పొందాలని ఆయన కోరారు. ఇవి పూర్తిగా చదును చేసిన భూభాగంలో ఇళ్ల స్థలాలను విభజించి, సర్వే రాళ్లు నాటామన్నారు. అత్యధికంగా ఒక్క గుమ్మిలేరులోనే మండల పరిధి 12 గ్రామాలకు సంబంధించిన గుర్తించిన అర్హులకు 1300 ఇళ్ల స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిటి జానకి రామయ్య, జగనన్న భూసర్వే డిటి జానకి రాఘవ, మండల సర్వేయర్ ఎ.సందీప్ కుమార్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో గల విద్యాసంస్థ లయన్ జివి.రావు మోడరన్ డిగ్రీ కాలేజీ, వికాస ఆధ్వర్యంలో ఈ నెల 4న శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మోడరన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్రా కంపెనీలో బిపిఒ, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్మేజెంట్ ఈ సర్వీస్ కంపెనీలో బిపిఒ (వాయిస్ ప్రాసెస్ తెలుగు)అనుజ మోటార్స్ శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్, ఇండో ఎంఎం.కంపెనీ, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్ అర్హతతో 30 సంవత్సరాల వయస్సు లోపు గల అభ్యర్థులు హాజరు కావొచ్చని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేలు నుంచి రూ.20 వేల జీతంతో పాటు భోజనం ఏర్పాటు, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4తేదీ శనివారం ఉదయం 9 గంటలకు మోడరన్ కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో హాజ రుకావాలన్నారు. వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గుంటూరు మాణిక్యంను 88975 61541నెంబర్ సంప్రదించ చవచ్చ న్నారు.www.vikasajobs.com వెబ్‌సైట్‌లో వివరాలు పొందవచ్చున్నారు.

నేరాలు ఘోరాలు

అల్లవరం ఇఒపిఆర్‌డి ఆత్మహత్య

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఇఒపిఆర్‌డి కొండా వెంకటేశ్వరరావు(50) కార్యాలయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న డిఎస్‌పి అంబికాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అనుమానస్పదమృతిగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు అనంతరం వివరాలను వెల్లడిస్తామని డిఎస్‌పి తెలిపారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు, అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ డిఎస్‌పి వెంట ఉన్నారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం రాయ భూపాల పట్నంలో గురువారం ఎక్సైజ్ ఎస్ ఐ నాగేంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సత్యం సత్తిబాబు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. సారా రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ సిబ్బంది,మహిళా పోలీస్ శృతి పాల్గొన్నారు.

వాలంటీర్‌పై లైంగిక వేధింపులు

ప్రజాశక్తి-కొత్తపేట

మండల పరిధిలోని పలివెల గ్రామ సచివాలయంలో వాలంటీర్‌గా పని చేస్తున్న తనను గ్రామానికి చెందిన మరో వాలంటీర్ లైంగికంగా వేధిస్తున్నారని మహిళా వాలంటీర్ పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. పలివెల గ్రామ సచివాలయంలో అదే గ్రామానికి చెందిన మోటూరి సుబ్రహ్మణ్యం ఈ వేధింపులకు దిగినట్లు మహిళా వాలంటీర్ ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

నలుగురికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - దేవరపల్లి

ఏలూరు జాతీయ రహదారిలోని దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ట్యాంకర్‌ను ప్రయివేటు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. క్షతగ్రాతులను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం తాళ్లూరులో రాత్రి పెళ్లి ముగించుకుని పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పెదతాడేపల్లికి శుభకార్యానికి సుమారు 25 మంది ప్రయివేట్ ట్రావెల్ బస్సులో వెళ్తున్నారు. దేవరపల్లి వద్ద హైవేపై ఆగి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఈ బస్సు ఢీకొని పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో నలుగురికి గాయాలు కాగా, వీరిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరపల్లి సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీహరిరావు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాద స్థలాన్ని గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు సందర్శించారు.

ఆబోతు దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో గురువారం ఉదయం ఒక ఆబోతు బీభత్సం సృష్టించింది. కనబడిన వారందరినీ దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని వీరభద్రపురంలో ఈ ఘటన జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒక ఆబోతు వీధుల్లోకి ప్రవేశించింది. ప్రవేశించడం తోనే రోడ్డుపై పారిశుద్య విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులను, బలుసులపేటకు చెందిన ఒక న్యాయవాది పెయ్యల చక్రవర్తితో పాటు దారిన వెళుతున్న మరో ముగ్గురిపై దాడి చేసింది. వారు తీవ్రంగా గాయపడగా న్యాయవాది చక్రవర్తిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైసిపి నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఆబోతు బంధించి చెట్టుకు కట్టేశారు. అనంతరం స్థానిక పశువైద్యులకు సమాచారం అందించారు. సామర్లకోట, వెట్లపాలెం గ్రామాలకు చెందిన పశువైద్యులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ వర్మ ఘటనా స్థలానికి చేరుకుని ఆబోతుకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి అదుపు చేశారు. అనంతరం ఆబోతును పరిశీలన నిమిత్తం స్థానిక పశువైద్యశాలకు తరలించారు. ఆబోతు దాడిలో గాయపడిన చికిత్స పొందుతున్న పారిశుద్య కార్మికురాలిని, క్షతగాత్రులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, మాగాపు గోపి, చిట్టిమాని శ్రీనివాసరావు, కౌన్సిలర్ నమ్మి శ్రీనివాసు, కో ఆప్షన్ సభ్యులు సల్మారి కళ్యాణ్ పరామర్శించారు.

వరి కోతలు ప్రారంభం

కానరాని ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మండల పరిధిలో వర్షాభావ పరిస్థితుల మధ్య ఖరీఫ్ సాగు జరిగింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ వరి పంట కోతలకు వచ్చింది. మండలంలోని వేట్లపాలెం, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులుగా పంట కోతలు జరుగుతున్నప్పటికీ మండలంలో నేటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 21 రైతు భరోసా కేంద్రాలు ఉన్నప్పటికీ 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రతి సీజన్లో ఏర్పాటు చేస్తున్నారు. 18 గ్రామాల్లో 22,364 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేశారు. ప్రభుత్వం సాధారణ వరి క్వింటాలుకు రూ.2153 మద్దతు ధర ప్రకటించగా, ఫైన్ రకం ధాన్యానికి రూ.2203 మద్దతు ధర ప్రకటించింది.

నేడు పెబి.దేవంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

శుక్రవారం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామంలోని ఆర్‌బికెలో కొనుగోలు కేంద్రాన్ని జెసి ఇలాక్కియా ప్రారంభించనున్నట్లు తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి తెలిపారు. అలాగే సామర్లకోట టిటిడిసిలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు మండల పరిధిలోని 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చెందిన కస్టోడియల్ ఆఫీసర్లకు, సిబ్బందికి, విఆర్ఒలకు ధాన్యం కొనుగోలుపై సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు పలు ఆర్‌బికెల పరిధిలో 170 ట్రాక్టర్లను ధాన్యం తరలించేందుకు జిపిఎస్‌కు అనుసంధానం చేశామని వ్యవసాయ అధికారి ఇమ్మడిశెట్టి సత్య ప్రజాశక్తికి చెప్పారు.

వేట్లపాలెంలో వరి పంట కోత నిర్వహిస్తున్న యంత్రం

జిజిహెచ్‌లో కూలిన వృక్షం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో గురువారం ఓ భారీ వక్షం అకస్మికంగా కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరక్కపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఆర్‌ఐ పరికరాన్ని ప్రారంభించేందుకు కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగ గీత, సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ ఇతర వైద్య నిపుణులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ వెళ్లగానే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కార్యక్రమం అనంతరం ప్రముఖులు బయటకు రాగానే ఒపి బ్లాక్ మెడికల్ వార్డు మధ్యలో భారీ వృక్షం కూలిపోయింది. దీంతో రోగులు, వైద్యులు పరుగులు పెట్టారు. ఈ ఘటనలో కారు ధ్వంసమైంది, మరో మహిళ గాయపడింది. విపత్తు నివారణ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి చెట్టును తొలగించారు.

బాబును మళ్లీ అరెస్ట్ చేసేందుకే మరో కేసు...

ప్రజాశక్తి-కొత్తపేట

టిడిపి అధినేత చంద్రబాబునాయుడును మళ్లీ జైలులోనే ఉంచాలనే ఉద్దేశంతోనే వరుసగా కేసులు పెడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు రెడ్డి అనంతకుమారి, టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఐడి తాజాగా నమోదు చేసిన మద్యం కేసులో చంద్రబాబును కావాలనే ఇరికించారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబుకు బెయిల్ ఇస్తే మరో కేసులో అరెస్ట్ చేయాలన్న కుట్రతోనే తాజాగా కేసు నమోదు చేశారన్నారు. అడ్డగోలుగా కేసులు, తప్పుడు ఆరోపణలు చేయడం తప్ప జగన్ ఏమీ సాధించలేదన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతిని అణచివేయడమే లక్ష్యంగా కొల్లు రవీంద్రపైనా తప్పుడు కేసు పెట్టారన్నారు.

గ్రామీణ యువతులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి మగ్గం, ఎంబ్రాయిడరీలో గ్రామీణ యువతులకు 30 రోజులపాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యువతులకు మాత్రమేనని, వయస్సు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, కనీసం 8వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. శిక్షణ కాలంలో పూర్తిగా ఉచిత భోజనం వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం 77805 99939, 85559 88580 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రత్యేక ఓటర్ నమోదును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఓటు నమోదు, తొలగింపు, సవరణలు, ఆధార్ అనుసంధానం కొరకు ఈ నెల 4, 5 తేదీల్లో చేపడుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి బి.రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4,5 తేదీల్లో గోపాలపురం నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బూత్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ అందుబాటులో ఉంటారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం ఎటుగట్టు రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వంగలపూడికి చెందిన పి.వెంకటేశ్వరరావు(32) సీతానగరం నుంచి వంగలపూడికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. సింగవరం ఎటుగట్టు వద్దకు వచ్చేసరికి ట్రక్కు ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గోవిందపురంలో జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు, ఎస్ఐ నాగార్జునరాజు సిబ్బందితో సారా బట్టీలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు 8 డ్రమ్ముల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సిఐ సూర్య అప్పారావు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'సీస్' పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగే సీస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డిఇఒ ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 926 పాఠశాలల్లో 3వ తరగతి, 6వ తరగతి, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 25,482 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. 3,435 తెలుగు మీడియం, 22,047 ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఉన్నారన్నారు. దీని కోసం 46 మంది బ్లాక్ లెవెల్ కో-ఆర్డినేటర్లు, 1,020 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఉంటుందన్నారు.

గోపాలపురం : మండలంలో స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఇఒలు జి. శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని 31 పాఠశాలల్లో 3, 6, 9 చదివే విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షను దేశమంతటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుపై కేసుల పట్ల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని అక్రమంగా కేసు పెట్టటం సిగ్గుచేటని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర పావని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టడాన్ని నిరసిస్తూ సుంకర పావని ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, ధర్నా చౌక్ వద్ద టిడిపి శ్రేణులు గురువారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ ఒక్క రూపాయి అవినీతి నిరూపించకుండా స్కిల్ డెవలప్మెంట్‌లో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబుకు బెయిల్ తథ్యమని తెలియటంతో మద్యం టెండరులో అవినీతి జరిగిందని కేసు పెట్టారన్నారు. పైగా రాజకీయ సభల్లో పాల్గొనకూడదని, ప్రెస్ మీట్స్ పెట్టకూడదంటూ హైకోర్టులో పిటిషన్లు వేసి జగన్ తన పిరికితనాన్ని చాటుకున్నారన్నారు. జిఒలిచ్చిన అజేయ కల్లాంను వైఎస్.జగన్ ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుత్తుల సూర్యావతి, బొందల రామలక్ష్మి మాజీ జెడ్‌పిటిసి రేలంగి వెంకట్, సోషల్ మీడియా కన్వీనర్ రాసంశెట్టి బేబీ, పార్వతి, సత్య, రామలక్ష్మి, రాఘవమ్మ, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

64 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలోని క్వారీ పుంత జంక్షన్ వద్ద 64 కేజీల గంజాయిని పోలీసునలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.2.24 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే నిందితుల నుంచి రూ.25వేల నగదు, 8 స్మార్ట్ ఫోన్‌లు, రెండు కీప్యాడ్ ఫోన్లు, ఒక కారు, నాలుగు బైకులను స్వాధీనం చేసకున్నారు. నిందితులు బొంత శ్రీనివాస్, సోమిరెడ్డి లోవరాజు, గంటా లోవరాజు, గండేపల్లి దుర్గాప్రసాద్, కిల్లాడ సురేష్, మురేగషన్ విజయ్‌కుమార్, పులిగొంటి వెంకటప్రసాద్, చిట్టూరి అంజిలను అరెస్టు చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు సెబ్ జిల్లా అధికారి జి.ప్రేమ్‌కాజల్ పర్యవేక్షణలో ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి అజయ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో గంజాయిని పట్టుకున్నారు.

బాబును ఎదుర్కొనే దమ్ము జగన్‌కు లేదు: బోళ్ల

ప్రజాశక్తి-రాజోలు

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బయట ఉంటే ఎన్నికల్లో ఎదుర్కొనే దమ్ము జగన్‌కు లేదని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ అన్నారు. గురువారం రాజోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. బాబును జైల్లో పెట్టి ఎన్నికలకు వెళ్లాలని జగన్ భావిస్తున్నారని ఆయన అన్నారు. సిబిఐ, ఈడీలు తన అక్రమాలను విచారణ చేయడానికి ముందే అవే అంశాల్లో చంద్రబాబును బద్నాం చేద్దామని జగన్ కుట్ర పన్నారన్నారు. జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఎపి బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి మాట్లాడిన వెంటనే చంద్రబాబుపై మద్యం కేసు పెట్టారని తెలిపారు. రెండు రోజుల క్రితం వైసిపి చేస్తోన్న ఇసుక కుంభకోణం గురించి పురందేశ్వరి మాట్లాడితే ఇసుక కేసు కూడా పెట్టారన్నారు. జగన్ చేస్తున్న అక్రమాలపై ఈడీ, సీబీఐల విచారణను పురందేశ్వరి కోరితే.. జగన్ సిఐడిని రంగంలోకి దించుతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వం చేసే కుంభకోణాలపై పురందేశ్వరి కేంద్రానికి ఫిర్యాదు చేస్తుండడంతో జగన్‌లో భయం పట్టుకుందన్నారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో లిక్కర్ స్కాం జగన్ హయాంలో జరిగిందన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా అందుబాటులో వైద్యం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వైద్యం పేదలందరికీ చేరువలో ఉండాలని దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి లక్ష్మీ నారాయణ అన్నారు. గురువారం సామర్లకోట ఆరవ సచివాలయం పరిధిలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను రాజేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్య సురక్ష ద్వారా అధ్వానంగా ఉన్న ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోశారన్నారు. అనంతరం ఆమె ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణా కృష్ణమూర్తి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, హైస్కూల్ హెచ్‌ఎం యు.సత్య నారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న రాజేశ్వరి

చేనేత సొసైటీకి వైఎస్‌ఆర్ అవార్డు

ప్రజాశక్తి-కాకినాడ

2023కు గాను ఉప్పాడ చేనేత సహకార సంఘానికి వైఎస్ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కడం అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. అవార్డ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1న విజయవాడలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఉప్పాడ చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి కంప చేతన్ అవార్డు, ప్రశంసా పత్రం, రూ.10 లక్షల నగదు అందుకున్నారు. గురువారం కాకినాడలో కలెక్టర్ కతికా శుక్లాను జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, ఇతర సిబ్బందితో కలిసి అవార్డును అందించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సంఘం సభ్యులను, అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 1938లో ప్రారంభమైన ఉప్పాడ చేనేత సహకార సంఘం 85 సంవత్సరాలుగా చేనేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తోందన్నారు. ఉప్పాడ జాంధానీ చీరలకు 2008లో జిఐ ట్యాగ్ గుర్తింపు వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవార్డు నగదును ఉప్పాడ చేనేత సహకార సంఘం అభివృద్ధికి, సభ్యులకు పని కల్పించేందుకు వినియోగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఎడి కె.పెద్దిరాజు, చేనేత అభివద్ధి అధికారులు ఎయు.రవికుమార్, భాస్కర్, ఎడిఒలు, దాసం బాలాజీ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో చేనేత, జౌళి శాఖ అధికారి, సంఘం ప్రతినిధులు

గోదావరి శుభ్రంగా ఉంచుదాం : ఇఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారమ భీమేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గల గోదావరి నదిని పరిశుభ్రంగా ఉంచాలని ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గోదారి జలాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజూ బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. సప్త గోదావరిలో స్థానికులు పూజా వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను వేయడం వల్ల నదీ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు.కార్తీక మాసంలో యాత్రికులు స్నానాలు చేసేందుకు వస్తారని,ఈ నేపథ్యంలో గోదావరిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దీనికోసం నిత్యం చెత్తను ఇద్దరు మత్స్యకారులను పెట్టి తొలగిస్తున్నామన్నారు. ఫిషరీస్ శాఖను సంప్రదించి నీరు గ్రీన్ కలర్‌లోకి మారకుండా కెమికల్స్ వాడుతున్నామన్నారు. ఫిషరీస్ అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడి నదీ జలాలను కాకినాడలో కెమికల్ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ఈ రిపోర్టు వచ్చేందుకు ఒకరోజు పడుతుందన్నారు. ఈ రిపోర్టుల ఆధావరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరించి చెత్తను గోదావరిలో వేయరాదని సూచించారు.

వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించాలని సర్పంచులు దాసి మీనా కుమారి, వాసంశెట్టి సునీత అన్నారు. గురువారం మండలంలోని వల్లూరు, మాచర, గ్రామపంచాయతీల కార్యాలయాల వద్ద నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఒ వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల ప్రణాళికను చదివి వినిపించారు. గ్రామ పరిధిలో చేపట్టబోయే పంట కాలువలు, బోదెలు, చెరువులు, మట్టి రోడ్లు, హౌసింగ్ సంబంధించి వల్లూరులో 90 పనులు, మాచరలో 64 పనులు గుర్తించామని ఎఫ్ఎలు రాణి చాందిని, శివకష్ణ తెలిపారు. ఈ పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనన్నట్లు ఎపిఒ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు టి.సుభాకర్, చిన్నబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు లోవరాజు, పి.రజిత్, మేట్లు, ఉపాధికూలీలు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఒ వెంకటలక్ష్మి

యానాం వార్తలు

ఎంఎల్ఎ అశోక్‌ను సత్కరిస్తున్న డిడి శివసుబ్రహ్మణియన్

ఎంఎల్ఎ గొల్లపల్లిని అగ్రికల్చర్ డిడి

ప్రజాశక్తి - యానాం

యానాం నూతన అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రహ్మణియన్ గురువారం స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఎల్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఇప్పటివరకు అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన గణేషన్ కరైకల్ బదిలీపై వెళ్లారు. అలాగే యానాం పరిపాలనాధికారి మునిస్వామిని డిడి మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించారు.

బిఎస్‌పి సమావేశానికి తరలిరండి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తలం

అమలాపురంలో ఈనెల 8న నిర్వహించనున్న బిఎస్‌పి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం పంచాయతీ కామరాజుపేటలో గురువారం బిఎస్‌పి అమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పెండెం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిఎస్‌పిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమలాపురంలో జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా పెత్తందారీ పార్టీలకు ఓట్లు వేస్తే ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. అంబేద్కర్ భారత రాజ్యాంగ మేనిఫెస్టోగా ముందుకు వెళ్తున్న బిఎస్‌పిని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, అసెంబ్లీ కన్వీనర్ నాగవరపు ఏడుకొండలు, కోశాధికారి సాకా రాజారావు, బుడితి దయామహేశ్వరరావు, బడుగు భీమేశ్వరరావు, జగదీష్ బాబ్జి, శివమణి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గరగ త్రినాధ రావు, తండ్రి: సత్యనారాయణ, శాంతినగర్, నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా అను నేను తెలియజేయునది ఏమనగా, పెద్దేవం గ్రామంలోని నాకు గల వ్యవసాయ భూమి కి సంబంధించిన, నెం.785/1986 & నెం.461/1987 తో గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ తేది.09-04-2023 న ఇల్లు మారుచున్నప్పుడు కనిపించకుండా పోయినవి. ఎంత వెతికిననూ దొరికి ఉండలేదు. సంబంధిత అధికారులు విచారణ జరిపి నాకు చెందిన సదరు వ్యవసాయ భూమికి గల ఒరిజినల్ దస్తావేజులు ఇప్పించలరు.

CHANGE OF NAME

I, undersigned **CHELLABOINA SRINIVAS (Old Name), S/o. Chellaboina Satyanarayana,** R/o. 5-89/1, Mallavanithota, Madiki, Dr. B.R.Ambedkar Konaseema, Andhra Pradesh-533126 changing my name from **CHELLABOINA SRINIVAS (Old Name) to CHELLABOINA SRINIVASU (New Name)** Shall Hense forth I am being called as **CHELLABOINA SRINIVASU (New Name)** for all purposes.

In the Court of the VII Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 270/2023

Between:
Siddanati Lakshminarayana ...*Plaintiff*
AND
Mudumbai Sesha Sridhar ...*Defendant*

Defendant: Mudumbai Sesha Sridhar, S/o. Varaha Swamy, aged 55 years, R/o. D.No. 70-2-146/D, Ramanayapeta, Kakinada Rural, Kakinada.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 10-11-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

DANIEL DINAKAR JASON
Advocate, Kakinada
Cell: 9848611143

In the Court of the Hon'ble V Addl. District Judge, Rajahmundry
ARB E.P. No. 62/2023
in **A.C. No. 187/2020**

Between:
M/s. Shriram Transport Finance Company Ltd., Mandapeta. Rep. by its G.P.A. Holder, S.Nookaraju ...*DHR*
AND
Bokka Sivakesava Rao and Others ...*JDr's*
Thorati Pushpavathi, W/o. China Veeraswamy, D.No. 7-272, Bangaramma Colony, Vemulapalli (V), Mandapeta (M), E.G.Dist., ...*2nd JDr*

పై నెంబరు గ్రంథంలో 2వ JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున ది. 16-11-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు ద్వారా గాని పైన తెలిపిన కోర్టుకు హాజరై సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు గ్రంథం మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

RAPARTHI CHITTIBABU
RAPARTHI VIJAYAKUMAR
Advocates, Rajamahendravaram
రాజమండ్రి Cell: 9949082146
02-11-2023 9177272198

లింకు డాక్యుమెంట్ పడిపోయినది

వంక సుబ్బలక్ష్మి అను నాకు మండపేట కె.పి.రోడ్డులోని ఇంటికి సంబంధించిన ద.నెం. 863/1955 లింకు డాక్యుమెంటును తీసుకుని 27-10-2023న గుమ్మిలేరు నుండి మారేడుబాక వెళ్తుండగా మార్గమధ్యలో మండపేటలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

నా అడ్రస్:
వంక సుబ్బలక్ష్మి
W/o. వి.వి.వి.సత్యనారాయణ
డో.నెం. 2-70, గుమ్మిలేరు
ఆలమూరు మండలం, పిన్: 533232
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
ఆంధ్రప్రదేశ్, సెల్: 7799770552

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా? మీరు విన్నది కన్నది పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?

అయితే దరఖాస్తు పంపండి

ప్రజాశక్తి

విలేకర్లు కావలెను

దినపత్రికలో పనిచేసేందుకు క్రింద తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను

- రాజమండ్రి సిటీ • రాజమండ్రి కార్పొరేషన్ • రాజమండ్రి రూరల్
- కోరుకొండ • రంగంపేట • కిర్లంపూడి • కాజులూరు
- కాకినాడ కార్పొరేషన్ • కాకినాడ భానుగుడి • పిఠాపురం రూరల్
- తుని • తుని రూరల్ • తొండంగి • ప్రత్తిపాడు • గొల్లప్రోలు • పి.గన్నవరం
- ముమ్మిడివరం • అల్లవరం • రాయవరం • ర.గంగవరం • మలికిపురం
- సఖినేటిపల్లి • అనపర్తి • నిడదవోలు రూరల్

విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో దరఖాస్తులను మెయిల్ చేయాలి
prajagodavari@gmail.com

సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169